

# కాపరి చేయాలి?

"అమ్మా, అమ్మా! ఆ పిల్లవాడికి మళ్లీ ఎక్కువైందమ్మా" అంటూ ఆదుర్దాగా వచ్చి నన్ను లేపింది ఆయా.

నేను ఉలిక్కిపడి లేచాను.

"ఆ పిల్లవాడికి మళ్లీ ఆయాసం ఎక్కువైందమ్మా. మీరు త్వరగా రావాలి."

ఆయా నిజంగానే కంగారు పడుతూంది. అవతల గదిలో భగవద్గీత తిరగవేస్తున్న మా శ్రీవారు కంగారుగా బయటకు వచ్చారు. "వెళ్లిరా, సరళా. మళ్లీ ఓ సారి చూసిరా. అవసరమైతే మళ్లీ ఆక్సిజన్ పెట్టించు" అన్నారు.

ఇద్దరమూ డాక్టర్లం. వారూ, నేనూ రాత్రి పగలూ శ్రమపడి ఎట్లాగో ఆ ప్రాణాన్ని మూడు రోజుల బట్టి నిలబెట్టి ఉంచాము. కాని ఆశ తక్కువే.

ఈ ఆక్సిజన్ ఎంత పెట్టినా లాభం లేదు. మందులన్నీ నీళ్ల పాలేనా?

నిద్దర బద్ధకాన్ని వదిలించేసి, స్టెతస్కోపు భుజాన వేసుకొని బయలుదేరాను. ఇంటికీ, వార్డుకీ వంద గజాల దూరం. బాటరీ లైటు కాళ్ల ముందు వేస్తూ ఆయా నా వెనకనే పరుగెత్తుకు వస్తూంది. అడుగుల వడికంటె గుండెల వడి హెచ్చిపోతూంది. ఇంటి నుంచి వార్డువరకూ ఉన్న వందగజాలూ నడిచిన కొద్దీ పెరుగుతున్నట్లనిపించింది. హాస్పిటల్ మేడ మీద నుంచి పది పన్నెండు కళ్లు చీకటిని చీల్చుకుంటూ నాకోసం, నావంక ఆదుర్దాగా ఎదురు చూస్తున్నాయి. వరండాలోనూ, మెట్ల మీదా నేను పరుగెత్తానేమో కూడా. కాని, గదిలోకి వెళ్లి చూసేసరికి ఆ పిల్లవాడు దీనంగా, ఆశగా మెడచాచి నా వంక చూశాడు. చాచిన మెడ అంతలోనే వేలాడిపోయింది. ఒక్కసారి బలవంతాన శ్వాస తీశాడు. బలహీనంగా పూర్తిగా వదిలేశాడు — అంతే.

ఆదుర్దాగా స్టెతస్కోపు అందుకున్నాను. ఎంత విన్నా అంతా నిశ్శబ్దం. హృదయ కుహరాలు నిశ్శబ్దం. గది అంతా నిశ్శబ్దం. హాస్పిటల్ భవనం చుట్టూ ఉన్న తోటంతా నిశ్శబ్దం. సకల భువనాలూ నిశ్శబ్దం.

స్టెతస్కోపు చేతిలోంచి జారిపోయింది. ఆశలన్నీ జారిపోయాయి. తిరగలేక తిరగలేక ఎట్లాగో వెనక్కు తిరిగాను.

"ఏమంటారు, డాక్టరు గారూ?" అంది పిల్లవాడి పెద్ద మేనత్త. నేనేం చెప్పలేక వరండాలోకి వచ్చేశాను. చెప్పవలసిన మాటలు నా కళ్ల వెంట చెప్పేశాయి.

గొల్లుమన్నారు తల్లితండ్రులూ, బంధుమిత్రులూ. ఝల్లుమన్నది నా తల్లి హృదయం.

"ఎందరెందరి ప్రాణాలో రక్షించావు. ఈ చిన్న వాడి గుక్కెడు ప్రాణం దక్కించలేకపోతావా అని గంపెడంత ఆశతో వచ్చాం, తల్లీ" అంటూ మేనత్త నేలమీద వాలిపోయింది.

"బాబూ! బాబూ! బాబూ!" మరో మాట రావటం లేదు ఆ తల్లి నోట.

"డాక్టరమ్మగారూ! డాక్టరమ్మగారూ! నా తమ్ముణ్ణేం చేసి పోతున్నారు?" అంటూ కుర్రవాడి అక్క పదహారేళ్ల పిల్ల — నన్ను వచ్చి కావలించుకుంది కదలనివ్వకుండా.

"వెళుతున్నారా డాక్టరుగారూ, వెళుతున్నారా? మా తమ్ముణ్ణి మా కివ్వకుండా వెళ్లిపోతున్నారా? ఇంత చదువూ, ఇంత విజ్ఞానం, ఇంత పెద్ద ఆసుపత్రి, ఇంతమంది పనివాళ్లూ ఈ చిన్నప్రాణాన్ని నిలబెట్టలేకపోయారా, డాక్టరు గారూ?" వలవలా ఏడుస్తున్న పిల్లను కన్న తండ్రి కన్నీళ్లతోనే వచ్చి అవతలకు తీసుకెళ్లాడు. "తప్పమ్మా, తప్పు. వారుమాత్రం ఏం చేస్తా" రంటూ.

'ఏం చేస్తాను? నేనుమాత్రం ఏం చేస్తాను!' అనుకొంటూ ఇంటికి నడిచాను.

'ఈ చిన్న ప్రాణాన్ని కాపాడలేని ఈ విజ్ఞానం ఎందుకు? ఈ డాంబికాలెందుకు? ఎందుకు?'

ఇంటికి నడుస్తూంటే చీకట్లో మరేమీ కళ్లకు కనిపించలేదు. ఈ పెద్ద ప్రశ్నే కనుపిస్తూంది.

ఎట్లా వచ్చానో ఏమో? ఇంటికి వచ్చేశాను. స్టెతస్కోపును అసహ్యంతో అవతల పారేశాను. అవతల గదిలో వారింకా 'గీత' చదువుతూనే ఉన్నారు. నన్ను చూసే గ్రహించారేమో? చదవ విరిచి తల వంచుకున్నారు.

మూడు రోజులుగా ఈ ప్రాణంతో పోరాటం! చేతనయినంత ప్రయత్నం చేశాను. ఉన్న తెలివితేటలన్నీ ఉపయోగించాను. కళ్లలో నెయ్యి జ్యోతులు వెలిగించుకుని కనిపెట్టి ఉన్నాను.

నిన్న మధ్యాహ్నం కాస్త మెరుగ్గానే కనిపించింది. ఈ వేళ ఉదయం కూడా ఫర్వాలేదనిపించింది. సాయంత్రం కూడా బాగానే ఉంది. ఇప్పుడే పది గంటలకు అలా వెళ్లి కళ్లు మూశానో లేదో— అంతలో అంతా అయిపోయింది. భగవంతుడు వేళాకోళంగా వెక్కిరించాడు. ఆ తల్లి దుఃఖం ఏకట్లుపై పేల్చుకుంటూ వచ్చి, నా గుండెల్లో మార్మోగింది. ఆ దుఃఖా న్నాపటం నా తరమా!

వెళ్లాలి. వెళ్లి ఆ తల్లి దుఃఖా న్నేలా గన్నా చల్లార్చాలి. "ఈ కడుపుకోత నాకు కూడా కొత్తగాదమ్మా" అని ఓదార్చాలి.

ఆ ఆశతోనే దిగ్గున లేచాను. వడివడిగా నాలు గడుగులు వేశాను. ఎదురుగా 'బాబు' ఫోటో నవ్వుతూ కనుపించింది. ఎనిమిది నెలల బాబు నవ్వుతూ ఎత్తుకో మన్నట్లుగా చేతులుచాచి ముందు కురుకుతున్నా డా ఫోటోలో.

"అంత బాధ పడతా వెందుకమ్మా? మందివ్వగలవు గాని ప్రాణాలు పొయ్యగలవా?" అంటున్నా డనిపించింది.

"ప్రాణాలు పొయ్యలేము, బాబూ. పొయ్యకుండా నిలబెట్టటమే నాకు చేత నయిందంటా. ఈ అనుభవం, ఈ విజ్ఞానం, నా గర్వం, తెలివితేటలూ అన్నీ మరెందుకూ కొరగావు" అంటూ తల పక్కకు తిప్పుకున్నాను.

దృష్టి మరొక ఫోటో మీద పడింది. ఈ ఫోటోలన్నీ మా మరిది విశ్వం తీశాడు. గుర్తుకు వస్తుంటే ఇప్పుడు నవ్వూ వస్తుంది; పుట్టెడు దుఃఖమూ వస్తుంది.

కొంటెకోనంగి మా మరిది నేను ప్రసవించిన వెంటనే మా బాబును— మా ముసలి ఆయా చిన్ని కాళ్ల మధ్యగా వేళ్లు పోనిచ్చి, గట్టిగా, తల్లక్రిందులుగా పట్టుకుని మొదటి స్నానానికి బయటి గదిలోకి తీసుకుపోతుంటే ఆ ఫోటో తీశాడు.

తీసినవాడు ఊరుకోక — "ఆగు, డాక్టరమ్మ పిల్లవాణ్ణి కూడా ఇట్లా తల్లక్రిందులుగా తీసుకుపోతావా? మా వదినతో చెబుతా" నంటూ బెదిరిస్తూ ఏడిపించేవాడు చాలా రోజులు.

## డాక్టర్ కొల్లిపాటి గంగాధరరావు

దాని పక్కనే ఉంది బారసాల ఫోటో. పీటల మీద దంపతుల మిద్దరం ఉన్నాం. ఆ రోజున — "ఎంత చదువుకున్నదానివయినా, ఎంత పెద్ద డాక్టరమ్మ వయినా నడికట్టు తప్పు" దన్నా రందరూ.

ఆచారం ఆచారమే అన్నారు కొందరు. వద్దు వద్దంటున్నా నాకు నడికట్టు కట్టారు. పిదానే పూశారు. తమలపాకు లిచ్చారు. చీర కొంగు తలమీదకు ముసుగు లాగారు.

ఎంత చదువుకున్న దాన్నయినా, ఎంత పేరున్న డాక్టరు నయినా ఆనాటి ఆ ఫోటో చూసుకున్నప్పుడల్లా ఏదో గర్వం ఎదలో మెదులుతుంది. అంతలో గుండె కదిలి ఏదో బాధ మొదలు పెడుతుంది.

తరవాత ఫోటో 'బాబు' తప్పటడుగులు వేస్తున్నప్పటిది. ఇప్పటికీ ఆ బొమ్మను చూస్తుంటే బాబు ఎప్పుడు పడిపోతాడో నని మా ఇద్దరి కనురెప్పలు ఆడటం ఆగిపోతాయి.

"కాళ్ల ఎముకల్లో బలం రానిదే నడిపించ గూడ" దని నేనూ - "నడిపిస్తుంటే బలం అదే అవుతుం" దని వాళ్ల నాన్నగారూ — ఎప్పుడూ వాదించుకునేవాళ్లం.

భార్యాభర్తలిద్దరూ డాక్టర్లవటం వల్ల వచ్చే ఇబ్బంది ఇదే. డాక్టర్ల అభిప్రాయాలు ఎప్పుడూ ఏకీభవించవు. ఇద్దరూ భార్యాభర్తలయినా సరే, పిల్లవాడు సొంతవాడయినా సరే.

మా వాదన లిట్లా సాగుతూనే ఉన్నాయి. బాబు దోవన బాబు బాగ నడిచి, బాగా పరుగెత్తటం కూడా ఆరంభించాడు. ఆదిగో — ఆ ఫోటోలో బాబు పరుగెత్తుతున్నాడు.

కాస్త తీరికయిన సాయంత్రం పూట మేం భార్యాభర్తలం హాస్పిటల్ ఆవరణలో 'రింగు' ఆడుతుండే వాళ్లం. రింగుకోసం మా ఇద్దరి మధ్య పరుగెత్తుతూ బాబు రింగు తనకి కావాలని పేచీ పెట్టేవాడు. ఇవ్వకుండా ఎగరేస్తూ వాణ్ణి ఇద్దరం ఏడిపించేవాళ్లం. మా ఇద్దరి మధ్య ఆటీ ఆటీ, ఇక ఆడలేక, ఏడుస్తూ బాబు చతికిలపడేవాడు. వాడు ఏడుస్తున్నా అదొక ముద్దుగా ఉండేది. ముద్దొస్తున్న వాణ్ణి ఏడవనిచ్చేవాళ్లం గాదు ఆట్టే సేపు.

బడికి వెళ్లటానికి వాడికి ఎప్పుడూ ఏడుపే. దొరలాగ పేంటూ బూటూ, మెడకు వేలాడుతూ పలకా, పుస్తకాల ప్లాస్టిక్ సంచీ, చేతిలో బలపం, రెండవ చేతిలోనూ, బుగ్గల్లోనూ చాకొలెట్లూ, బుంగమూతీ, బుగ్గలమీద కన్నీళ్లూ... ఆ ఫోటో ఎంతసేపు చూసినా ఇంకా చూడాలనే అనిపిస్తుంది.

తరవాత ఫోటో ఊహ తెలిసిన బాబుది. నవ్వు సంగతీ, పేరు సంగతీ తెలియని బాబును అప్పటివరకూ మేమందరం — మా భార్యాభర్తలిద్దరం, హాస్పిటల్ పరివారం పది మందీ కళ్లలోనే పెట్టుకు పెంచాం. చిరునవ్వు ఎప్పుడూ చెదరనివ్వలేదు. జ్వరమును ఎప్పుడూ జారనివ్వలేదు.

పుస్తకాల్లో చదివిన విధంగా, అనుభవం నేర్పిన విధంగా, కలలో తలపెట్టిన విధంగా మనసు పెంచుకుంటూ పెంచాం. పెరిగాడు ఎనిమిదేళ్లు.

ఊరూ, ఊహా తెలిసిన తరవాత కూడా ఎప్పుడూ మా కన్నుగప్పి పోనివ్వలేదు. హాస్పిటల్లో ఎవరి పనులు వారు చేసుకుంటున్నప్పుడు కూడా వారు తన గదిలోనుంచీ, నేను నా గదిలోనుంచీ ఓ కంట బాబును కనిపెడుతూనే, రెండవ కంట రోగిని పరీక్ష చేసేవాళ్లం.

హాస్పిటల్ పనయిపోయిన తరవాత ఇద్దరం ఇంటికొచ్చి, ఆ రోజున బాబు

**ఉపకారం**

సిద్ధజ్ఞానం ఉన్నప్పుడు, దానితో తమ జ్ఞానజ్యోతుల్ని వెలిగించుకునే అవకాశం ఇతరులకు కల్పించు.

— తల్లి

ఏమేమి ఎట్లా ఆడాడో తెలుసుకుంటూ చెప్పుకుంటే, మా ఇద్దరికీ లెక్కకు లెక్క సరిపోయింది.

"వాడినో పెద్ద డాక్టర్ని చేయా"లని వారూ, "కాదు ఇంజనీర్ని చెయ్యా" లని నేనూ రోజూ వాదనలు పెంచుకునే వాళ్లం. పంతాలు కట్టుకునే వాళ్లం.

"ఎందుకొచ్చిన డాక్టరు వృత్తి! చీమూ, నెత్తురూతో రోజూ జీవించటం. బాధనే చూస్తూ, బాధతో బ్రతకటం. మనం ఇద్దరం చేస్తున్నాం, చూస్తున్నాం చాలదా?" అని నేనంటే — "కాదు. ఒకరి బాధ తగ్గించిన సంతృప్తి, ఒక ప్రాణాన్ని రక్షించిన ఆనందమూ, ఒక ఆపదలో ఆదుకున్న ఆత్మశాంతి వెయ్యి ఆనకట్టలు కట్టినా రాదు" అనేవా రాయన.

అయినా, ఆయనకు బాబు ఇంజనీరే అవుతాడేమోననే భయం ఉండేది. ఒక రోజున పేపర్లో ఒక పెద్ద ఇంజనీరు ఆనకట్ట రిపేరు చేయిస్తూ ప్రమాదవశాత్తూ నదిలో పడి మునిగిపోయాడని చదివారు. ఆ వేళే అన్నారు — "బాబుకు బాగా ఈత నేర్పించా"లని.

"తక్కినవన్నీ వాడే నేర్చుకుంటాడు. సైకిల్ లాంటివి వాడే నేర్చుకున్నా ఫర్వాలేదు. అంతగా అయితే క్రింద పడితే కాస్త దెబ్బ తగులుతుంది. కాని, ఈత అట్లా కాదు. ప్రాణప్రమాదం" అన్నారు.

అవ్వ మరునాడే ఈతకు కావలసిన పరికరాలన్నీ కొనుక్కు వచ్చారు. తల కొక రబ్బరు టోపీ, రబ్బరు లాగూ, బనియనూ — అన్నీ తగిలించుకుని తీయించుకున్న ఫొటో అది. అవి అన్నీ తొడుక్కున్న, బాబు అప్పుడప్పుడూ దగ్గర్లోనే ఉన్న 'తామర కొలను'కు ఈత నేర్చుకోవటానికి వెళ్లేవాడు. కొన్నాళ్లకు కాస్త ఈత వచ్చిందట కూడా.

ఓ రోజున మాకు ఇద్దరికీ ఆస్పత్రిలో ఊపిరాడనంత పని— నాలుగైదు ఆపరేషన్లు. అందులో ఒకటి 'ఎపెండిసైటిస్' ఆ పూటే వచ్చిం దా కేసు.

పిల్లలందరూ కలిసి చాలాసేపు ఒడ్డు దగ్గరే ఈతకొట్టారట. దూరంగా చెరువు మధ్య తామర పువ్వులు ఎంతో అందంగా విచ్చి, కనువిందుగా కనుపిస్తున్నాయట. కెందామరల అందంతో కొలను కొలనే వెలిగిపోతూందట.

ఆశతో అరవిందాల నందుకుందామనీ, అందినంత అందాన్ని తుంచుకొద్దామనీ బాబు అటు ఈదుకు వెళుతున్నాడట మధ్యలో రెక్కల్లో సత్తువ తక్కువ అయిందట. తగ్గిపోయిందట. ముందుకెళ్లి పువ్వుల నందుకోలేక, వెనక్కి తిరిగి ఒడ్డుకు చేరుకోలేక రెపరెపలాడుతూ, "అమ్మా, అమ్మా" అంటూ ఆక్రందిస్తూ బాబు నీళ్లలో మునిగిపోయాడు. దగ్గర్లో ఉన్న పెద్దవాళ్లెవరో చూశారు. నీళ్లలో దూకారు. కొన ఊపిరితో ఉన్న బాబును బయటకు లాక్కువచ్చారు. ఆపరేషన్ గదిలోకి కబురు పెట్టారు.

అక్కడ — లోపల — అపరేషన్ గదిలో ఎపెండిక్స్ ఆపరేషను, బయట గదిలో చావు బ్రతుకుల మధ్యలో బాబు!

"తొందరపడితే పరాయి ప్రాణం! తొందరపడకపోతే కన్న కడుపు!"

తొందరపడితే — పేగు మీద తెగిన రక్తనాళాన్ని ఏ ఒక్కదాన్నైనా గట్టిగా ముడివెయ్యకపోతే నిండు ప్రాణం ఓడిపోతుంది!

తొందరపడకపోతే అవతల గదిలో దక్కే గుక్కెడు ప్రాణం దక్కకుండా పోతుంది.

నా మనసు లోపల గదిలో ఆగటం లేదు. వారి దృష్టి అపరేషన్ గాయం నుంచి కదలటం లేదు. నిమిష నిమిషానికీ బయట నుంచి కబురు మీద కబురు. వినీ వినీ వారొక్క కేక వేశారు.

"ముందా తలుపు గడియ వేసెయ్యండి." తలుపు గడియ వేసేశారు. ఇరవై నిమిషాల దాకా మళ్లీ తెరవలేదు.

తరవాత. తలుపు తెరిచి పరుగెత్తుకు వెళ్లి చూస్తే ఏముంది? పెద్ద నర్సు కన్నీళ్లూ, ఆయా మూగ బాధా, నా కడుపుకోతా.

చూసినవా ళ్లెవరో వివరాలు చెపుతుంటే నా ప్రాణం విలవిలలాడిపోయింది. "అమ్మా, అమ్మా" అంటూ చేతులు చాచాడని వాళ్లు చెబుతుంటే నా రెండు చేతులు ఉండీ అందివ్వలేకపోయానని నా గుండె అల్లాడిపోయింది.

"భగవాన్! చేతులారా గుక్కెడు మందిచ్చే అవకాశం కూడా లేకుండా చేశావా? ఆ ఆత్మసంతృప్తికి కూడా నోచుకోలేదా!" అంటూ వలవలా ఏడ్చాను. డాక్టర్నని మరిచిపోయి విలపించాను. డాక్టర్నని జ్ఞాపకం వచ్చి, "మరి కాస్త తొందరగా ఆపరేషన్ అయిపోయి ఉంటే ఈ కడుపుకోత తప్పించుకునే దాన్ని గదా" అని గిలగిలలాడాను.

మృత్యువు వెనకనుండి వచ్చి కాటేసింది. బాబు మొహంలో రవ్వంతన్నా కళ తగ్గలేదు. ఏదో నిద్రపోతున్నట్లే ఉంది. నన్ను చూసి నవ్వుతున్నట్లే ఉంది.

"అమ్మా, నువ్వెంతో పెద్ద డాక్టరువి. కాని, అందరూ మందులు లేక చనిపోతున్నారా?" అని హేళన చేస్తున్నట్లే ఉంది.

"కాదు, బాబూ, కాదు. చనిపోవటానికి అనేక కారణాలున్నాయి. సహేతుకమైన కారణా లెన్ని చెప్పినా, తల్లి దుఃఖాన్ని ఉపశమింపజేసేదేదీ లేదు, బాబూ" అంటూ గొల్లుగొల్లున ఏడ్చాను.

రోజులు గడిచాయి. మాసాలు గడిచాయి. సంవత్సరాలు కూడా గడిచి పోతున్నాయి. కాని, ఈ మమకారం మాయలేదు. ఎక్కడ ఏ పిల్లవాణ్ణి బాబు ఈడు వాణ్ణి—చూసినా, మా ఇద్దరికీ ఒక్కసారిగా బాబు గుర్తు కొచ్చేవాడు. సైకి లంటే నేను బాధపడతానని వారూ, వారు బాధపడతారని నేనూ గుర్తులన్నీ చెరిపేసుకునేవాళ్లం. బాబును మరిచిపోయినట్లే నటించే వాళ్లం.

బాబు వయసు పిల్లవా డెవడైనా జబ్బును నిర్జించి కోలుకుంటున్నా, "మా బాబే" అన్నట్లు ఆనందించేవాళ్లం. ఏ పిల్లవాడైనా జబ్బునుంచి కోలుకోలేక బాధపడుతున్నా, చూడలేక, నే నక్కడే కుమిలిపోయేదాన్ని. నన్ను చూడలేక వారు అవతలి కెళ్లిపోయేవారు.

అప్పట్లోనే వారు భగవద్గీత చదవ నారంభించారు. ఆ నాటికీ నాడు ఈ పిల్లవాడు — అన్నివిధాలా మా బాబును పోలినవాడు—నన్ను చూసీ, నా శ్రమను చూసీ మరోసారి వెక్కిరించి నీ కంటే ఆ విధే బలీయమైనదని వెక్కిరించి వెళ్లి పోయాడు

భగవంతు డున్నాడా? రోజు రోజుకూ పెరిగిపోతున్న శాస్త్ర విజ్ఞానాని కవ్వల ఏ దిలోకంలోనో, ఏకాకృతితో ఉండి మనిషినీ, మనిషి జీవిత చక్రాన్నీ కదిలించి నడిపిస్తున్నాడా?

లేదు. ఆ నమ్మకం నాకు లేదు. చదివినదంతా ఎదురై నిలిచి, ఆ నమ్మకం చదివినకొద్దీ కరిగిపోతూంది. దేవుడున్నా 'మనిషే' మనిషికి ముఖ్యం.

కళ్ల నీళ్లతో ఆలోచనలు ఒక్కసారిగా చెదిరిపోయాయి. అవతల ఎవరో తలుపు కొట్టారు. వెళ్లి తలుపు తీశాను.

ఎదురుగా పిల్లవాడి తండ్రి ఉన్నాడు. గుండెల నిండా దుఃఖంతో మాట్లాడలేక మాట్లాడాడు.

"మాకోసం చాలా శ్రమపడ్డారు, డాక్టరుగారూ. చాలా శ్రమపడ్డారు. ఇంతకీ మేం దురదృష్టవంతులం." బరువుగా మాట్లాడుతూ, చేతులు చాస్తూ ముందుకి రాబోతున్నాడు. చేతిలో కొన్ని పది రూపాయల నోట్లున్నాయి.

"మీ ఋణం ఏం తీర్చుకోలేం కాని ..."

నాకు నోట మాట రాలేదు. ఆ డబ్బు తీసుకోనా? మా డాక్టర్ల కీమాత్రం హృదయం లేదా? నా బాబే అనుకుని ఇంతచేశానే! మా బాబు దగ్గర డబ్బు!

"వద్దు. వెళ్లిపోండి. డబ్బిచ్చి నన్ను వెక్కిరించకండి. కరుణించి ఇక్కణ్ణుంచి వెళ్లిపోండి!"

ఆవేశంలో ఈ మాటలే అన్నానో, వేరే ఏమన్నానో గుర్తులేదు. మరు క్షణంలో పక్కమీద ఒరిగిపోయాను. హృదయమంతా కరిగి నీరై కారిపోయే వరకు, కళ్లు రెండూ గుండెలతోసహా ఎండిపోయే వరకు విలపించాను. వారు గదిలో కెప్పుడొచ్చారో తెలియదు.

"సరళా, సరళా" అంటూ ఎన్ని సార్లు పిలిచారో! తల ఎత్తి దీనంగా వారి కళ్లలో కళ్లు నిలిపాను.

"నువ్వింకా పసిపిల్లవే, సరళా. కాని, ఇంత పసిపిల్ల వనుకోలేదు. జీవితాన్నెవ్వరం ఇంత 'సీరియస్'గా తీసుకో కూడదు. 'చావు' కూడా శరీరానికి ఒక సహజ పరిణామం.

మనం భగవంతుడు లేడనవచ్చుగానీ, భగవద్గీతను కాదనలేం. గీతలో ఉన్న దంతా మనిషి జీవితానికి ఒక ఒరవడి" అంటూ భగవద్గీత నా చేతి కందిచ్చారు. అందుకోబోతే జారి క్రింద పడిపోయింది.

తెరుచుకున్న పేజీలో నా కళ్ల కెదురుగా — "పద్మపత్ర మివాంభసా" అని కనుపించింది. నీటిలో ఉన్న నీరజ పత్రం లాగ జీవించటం నేర్చుకోవాలట! నా కది సాధ్యమా? ఆలోచిస్తూ పేజీలు కొన్ని తిరగవేశాను.

"అవ్యక్తాది భూతాని..." పుట్టుకకు ముందు లేదు, చావు తరవాత లేదు. మధ్యలోనే ఉన్న జీవితాన్ని గురించి ఎందు కీ దుఃఖం!

"కాదనలేవా!" అంటూ వచ్చి వారు నన్ను పసిపిల్లలాగ ఒళ్లోకి తీసుకుని ఓదార్చారు. ★